క్లుప్తంగా

అనాథ ఆశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచే సమాజ సేవను అలవర్చుకోవాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. కళాశాల ఎలైట్ అసోసియేషన్, యలమంచిలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టాభిపురంలోని మాతృశ్రీ అనాథ పిల్లల ఆశ్రమమానికి నెల రోజులకు సరిపడా బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకుల్ని అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ తోటివారికి సహాయ, సహకారాలు అందించే గుణాన్ని చిన్ననాటి నుంచే విద్యార్థులకు అలవాటు చేస్తే సమాజం శాంతియుతంగా ఉంటుందని తెలిపారు. సేవా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థుల్ని వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, పి. నరేంద్రకుమార్ అభినందించారు.

'అనధికార లేఅవుట్లపై చర్యలు తప్పవు'

గుంటూరు రూరల్: మండలంలోని వెంగళాయపాలెంలో అనధికార లేఅవుట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో సర్వే నంబర్లు 934–ఏ–1డి, 1173, 1174, 1199, 1213, 1214, 1223, 1229లో ప్రభుత్వం అనుమతి లేకుండా లేఅవుట్‌లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారని తెలిసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుమతి లేకుండా ఈ భూముల్లో అమ్మకాలు, కొనుగోళ్లు చేయరాదని ఆయన ప్రజలకు సూచించారు. ఈ భూముల్లో అక్రమంగా లావాదేవీలు జరిపినట్టయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

7 నుంచి శ్రీ లక్ష్మీతిరుపతమ్మ తిరునాళ్ల

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 7 నుంచి 11 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్‌కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 7న ఉదయం 6 గంటలకు నెల పొంగళ్లు, విశేష పూజలు, సాయంత్రం 6 గంటలకు స్వామి ఊరేగింపు, 8న ఉదయం 8 గంటలకు గణపతి హోమం, అభిషేకాలు, 9న లక్ష్మీనారాయణ హోమం, విశేష పూజలు, 10న ఉదయం 7 గంటలకు చండీ హోమం, కుంకుమపూజ, 11న ఉదయం 11 గంటలకు అన్నదానం జరుగుతాయని వివరించారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా గజలక్ష్మి, నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్‌పేట 4వ లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేద మంత్రాల నడుమ గజలక్ష్మి, నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో స్వామికి శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజలు జరిపారు. అనంతరం కల్యాణం సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన , రక్షా ధారణ, నవగ్రహారాధన, ప్రవర, సుముహూర్తం, మాంగల్య పూజ, అమ్మవారికి పుష్పాభిషేకం, సువాసినులకు కుంకుమ పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నేటి బాలలే రేపటి యువత

గుంటూరు మెడికల్: జాతీయ లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్, బీజేపీ నేత వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు లక్ష్మీపురం పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలులో 'ఎగ్జామ్ వారియర్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి భావిభారత పౌరులుగా ఎదిగి సైంటిస్టులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు, వైద్యులు, న్యాయమూర్తులు అవుతారని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడిని తట్టుకుని ఏ విధంగా పరీక్షలు రాయాలనే ప్రధాని నరేంద్ర మోదీ చెప్పిన 25 సూత్రాలు పాటిస్తే విజయం సాధించగలరని సూచించారు. మానసిక ఒత్తిడి తట్టుకుంటూ టీ అమ్మే స్థాయి నుంచి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగిన ప్రధాని నరేంద్ర మోదీని రోల్ మోడల్‌గా తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం నగరంలోని పాటిబండ్ల సీతారామయ్య హైస్కూలు, చలమయ్య హైస్కూలు, శ్రీ సత్యసాయి హైస్కూలు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పబ్లిసిటీ లిటరేచర్ డిపార్ట్‌మెంట్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్, ఈదర శ్రీనివాసరెడ్డి, వనమా నరేంద్ర, వెలగలేటి గంగాధర్, దారా అంబేడ్కర్, ఇండ్ల శ్రీధర్, సాధు రామకృష్ణ, కామేపల్లి వెంకటేశ్వర్లు, కారంశెట్టి రమేష్, కన్నెగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



వృద్ధుడి యోగక్షేమాన్ని అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు

మంచాల(చేబ్రోలు): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందించడమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. మంచాల గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రోశయ్య ప్రతి ఇంటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామంలో అధికారులు, నాయకులతో కలసి విస్తృతంగా పర్యటించారు. మహానేత వైఎస్సార్, చందు పరమయ్య, వంగవీటి మోహనరంగా, చందు పిచ్చియ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న రామాలయాన్ని పరిశీలించారు. గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ అందరినీ ఆత్మీయంగా పలకరించారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం సెంటర్‌లో జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ఇంటి వద్దకే పథకాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖల్ని మార్చినట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. రైతాంగ సంక్షేమ కోసం ప్రభుత్వం అన్నదాతలకు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట చేతికి వచ్చి విక్రయించుకునే వరకు అన్ని విధాలుగా అండగా ఉండి భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు వెంటనే పరిహారాన్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులు ప్రజల్ని మభ్యపెట్టి మోసగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యల్ని ఆయన అక్కడక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చందు వెంకట సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యురాలు తిరువీధుల అంజనాదేవి, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మండలనేని శ్రీనివాసరావు, తహసీల్దారు కె. సుజాత, ఎంపీడీవో బాబూరావు, ఏవో బి. శ్రీనివాసనాయక్, పంచాయతీ కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

మధుమేహంపై ఆధునిక పరిశోధనలతో మెరుగైన ఫలితాలు



పరిశోధకుడు బ్రహ్మంను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

గుంటూరు రూరల్: నేడు జీవనశైలిలో చోటు చేసుకున్న మార్పులు, అధిక క్యాలరీలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి వల్ల పలువురు మధుమేహానికి గురవుతున్నారని పరిశోధకుడు బి. బ్రహ్మం తెలిపారు. లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం 'ఆధునిక పరిశోధనలు.. మధుమేహంపై ఫలితాలు' అనే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భారతదేశంలో 25 సంవత్సరాలలోపున్న ప్రతి నలుగురిలో ఒకరికి అడల్ట్ ఆన్‌సైట్ టైప్– 2 డయాబెటిస్ ఉన్నట్లు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్ఆర్) యూత్ డయాబెటిస్ రిజిస్ట్రీ చెబుతోందని తెలిపారు. ఇటీవల డయాబెటిస్ జన్యుపరమైన అధ్యయనాలకు సంబంధించి జంతు ప్రయోగాలు అపారమైన సహకారాన్ని అందిస్తున్నాయని చెప్పారు. నూతన చికిత్స విధానాల ఆవిష్కరణ, పరీక్షల కోసం జంతు ప్రయోగాల నమూనాలు ప్రత్యామ్నాయంగా మారాయని పేర్కొన్నారు. మధుమేహానికి సంబంధించి ఆధునిక పరిశోధనల్లో వివరణాత్మక, కీలక ఫలితాల కోసం అణుజీవశాస్త్రం, జీవ రసాయన శాస్త్రం మీద విద్యార్థులు ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. న్నారు. మధుమేహం నుంచి బయటపడటానికి మొదటిగా బరువు తగ్గటం మార్గమని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం ద్వారా సులువుగా శరీర బరువులో 7 శాతం తగ్గించుకోవచ్చని సూచించారు. రోజంతా కూర్చుని పనిచేసేవాళ్లు కనీసం రోజుకు ఒకసారైనా శరీరంలోని అన్ని భాగాలు కదిలేలా నడవడం, ఆహారంలో ఆకుపచ్చ కూరగాయలు, ముఖ్యంగా బ్రోకలి, బీన్స్, ఓట్స్, క్వినోవా వంటివి చేర్చుకోవడం మంచిదని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు పాల్గొన్నారు.

రేపు గ్రూప్-2పై ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల ప్రయోజనార్థం ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ పి.కృష్ణప్రదీప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని అకాడమీ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న సదస్సులో సీనియర్ అధ్యాపకులు గ్రూప్–2 సిలబస్, ప్రిపరేషన్ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్, సమయపాలన తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉచిత అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 91332 37733, 040–35052121 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంగరంగ వైభవంగా కలశ ప్రతిష్ట మహోత్సవాలు



కలశ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



విగ్రహాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వేదమంత్రాల నడుమ మేళతాళాలతో ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్ట అత్యంత వైభవంగా జరిగింది. తొలుత కలశాలకు క్షీరాభిషేకం చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం మేళతాళాలతో క్రేన్ సహాయంతో గోపురంపై భాగానికి చేర్చారు. ఆలయ ప్రధాన పూజారి మాధవాచారి ఆధ్వర్యంలో కలశ ప్రతిష్ట చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ద్వారపాలకుల విగ్రహాలు, గరుడాళ్వార్, ఆంజనేయస్వామి విగ్రహాల్ని ఆవిష్కరించి, స్వామిని దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆశీర్వచనం చేశారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య సత్కరించారు. శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికగా నిత్య పూజలతో పాటు శ్రీ వెంకటేశ్వర మహామంత్ర హోమం నిర్వహించారు. ఆలయ ఉపాధ్యక్షుడు లంక విజయబాబు ఆధ్వర్యంలో పద్మావతి గోదా సమేత శ్రీనివాసుని నగరోత్సవాన్ని శేష వాహనంపై తిరువీధుల్లో కన్నుల పండువగా చేశారు. బ్రహ్మోత్సవ విశేషాల్ని మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, పూటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, అచ్యుతరామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

చిట్టచివరి ఇంటి వరకు సంక్షేమ లబ్ధి లక్ష్యం

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



కొలిమిలో కార్మికుడితో కలసి పని చేస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: మారుమూల ప్రాంతాల్లోని చివరి ఇంటి గడప వరకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తీసుకువెళ్లాలనేది ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాప్రతినిధులకు, అధికార యంత్రాగానికి లక్ష్యంగా నిర్దేశించారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తెలిపారు. 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి నేతృత్వంలో శుక్రవారం చిలకలూరిపేట రోడ్డులోని కేకేఆర్ థియేటర్ పక్కన ఏసుభక్తనగర్ చర్చి వద్ద నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్ ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాల్ని ఆరా తీయడంతో పాటు వారి సమస్యల్ని తెలుసుకున్నారు. సీఎం వై.ఎస్. జగన్ నాయకత్వంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం గత మూడున్నరేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాల్ని ప్రతి గడపకు తీసుకు వెళ్లి, అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చామని తెలిపారు. అర్హత కలిగిన ఏ ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందకుండా ఉండేందుకు వీల్లేదని స్పష్టంగా చెబుతున్న ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా వలంటీర్లను ఇంటింటికీ పంపి పథకాలు అందిస్తున్నామని వివరించారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలిచి, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం ప్రారంభమైన నాటి నుంచి వెళ్లిన ప్రతి గడపలోనూ ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో అధికారం కోసం పథకాలు ప్రవేశపెట్టి ఇచ్చిన హామీల్ని తుంగలో తొక్కారని ధ్వజమెత్తారు. పాదయాత్రలో జగనన్న ఇచ్చిన మాట కోసం ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎదుర్కొని పథకాల్ని అమలుపరిచారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండలు, సుందరరావు, చక్రి, బాలిరెడ్డి, ఉపేంద్ర, కాసిరెడ్డి, రాఘవమ్మ, మామిడి వెంకటేశ్వర్లు, హరిహరరావు, జ్యోతి, రూన్సీ, సౌజన్య, నాయకులు, బూత్ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం బాటలో గుంటూరు నగరాభివృద్ధి: మేయర్

- 18వ డివిజన్‌లో రూ.71 లక్షలతో సీసీ డ్రెయిన్లు, రహదారి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నేతలు

నగరంపాలెం: సీఎం బాటలో గుంటూరు నగరాభివృద్ధి చేయనున్నట్లు మేయర్ కావటి మనోహర్‌నాయుడు తెలిపారు. 18వ డివిజన్ శ్రీనివాసరావుతోట ఆరో వీధిలోని అచ్చయ్య డాబా సెంటర్ వద్ద రూ.41 లక్షలతో డ్రెయిన్లు, రామనామ క్షేత్రం రెండో వీధిలో రూ.30 లక్షలతో సిమెంట్ రహదారి, డ్రెయిన్ల నిర్మాణానికి శుక్రవారం ఆయన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌తో కలసి శంకుస్థాపన చేశారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలో కౌన్సిల్ ఏర్పడ్డాక కుల, మత, పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డివిజన్లల్లోని నాయకులు ప్రజా అవసరాల దృష్ట్యా స్థానికంగా సమస్యల్ని గుర్తించి తెలియజేస్తున్నారని చెప్పారు. వారి సూచనల మేరకు నిర్మాణ పనులకు అంచనాలు రూపొందించి శంకుస్థాపనలు చేస్తున్నట్లు వివరించారు. గుంటూరు నగరంలో రూ.150 కోట్లకు పైగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పూర్తయినట్లు చెప్పారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయంలో అభివృద్ధి పేరుతో గుంటూరు నగరాన్ని గుంతలూరుగా మార్చారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం గుంటూరు నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధిక శాతం నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఎన్నడూలేని విధంగా నగరాభివృద్ధి రాకెట్ మాదిరి దూసుకెళ్తోందని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, 41వ డివిజన్ కార్పొరేటర్ బొడ్డుపల్లి స్మితపద్మజ, నాయకులు గులాం రసూల్, గేదెల రమేష్, ఎల్లయ్య, కంతేటి శ్యాం, కలపాల సత్యం, ఎరబ్రాబు, పల్లపు దుర్గాప్రసాద్, వి.సుధాకర్, చేబ్రోలు శ్రీహర్ష, ఆర్మీ వెంకట్, పాలకాయల శివయ్య, జీఎంసీ డీఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మూడు దూడల మృతి

పెదనందిపాడు: కుక్కల దాడిలో మూడు దూడలు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం పెదనందిపాడులో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు దూడతో పాటు నరేంద్రకు చెందిన రెండు దూడలపై దాడి చేయడంతో అవి మృతి చెందాయి. పంచాయతీ సిబ్బంది త్వరితగతిన స్పందించి కుక్కల్ని పట్టించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పెదనందిపాడు: టిప్పర్ ఢీకొని మోపెడ్‌పై వెళుతున్న వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని వరగాని బస్‌స్టాప్ వద్ద శుక్రవారం జరిగింది. వరగానికి చెందిన కొల్లా వెంకటేశ్వర్లు మోపెడ్‌పై కూరగాయలు అమ్ముతుంటారు. ఈ క్రమంలో వరగాని బస్‌స్టాప్ వద్ద వెనుక నుంచి వస్తున్న టిప్పర్ మోపెడ్ తగిలింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి. మోపెడ్ పాక్షికంగా దెబ్బతింది.

లక్ష పసుపు కొమ్ములతో బగళాముఖిదేవికి పూజ



బగళాముఖీదేవికి లక్ష పసుపు కొమ్ములతో పూజ చేస్తున్న విశ్వయోగి విశ్వంజీ

చినకొండ్రుపాడు (ప్రత్తిపాడు): విశ్వనగర్ ఆధ్యాత్మిక శోభతో అలరారుతోంది. విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ జన్మదిన వేడుకల్లో భాగంగా శుక్రవారం శత్రు సంహార బగళాముఖీదేవికి విశేష పూజలు నిర్వహించారు. విశ్వంజీ సమక్షంలో వేద పండితులు లక్ష పసుపు కొమ్ముల పూజల్ని నేత్రపర్వంగా చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా సుందరంగా అలంకరించారు. విశ్వయోగి విశ్వంజీ అమ్మవారికి పూజాది కార్యక్రమాలను జరిపి, పుష్పాభిషేకం నిర్వహించారు. విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు దంపతులతో పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి వస్త్రాలు, పూజించిన పసుపు కొమ్ముల్ని భక్తులకు అందించారు. పూజా కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వందల సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గీతాలాపనలు, మహిళల కోలాట ప్రదర్శనలు అలరించాయి. శివపార్వతుల వేషధారణలో కళాకారుల సాంస్కృతి ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం సాయంత్రం రాజ్య జయం కోసం పసుపుకొమ్ముల రాజశ్యామల యాగాన్ని శాస్త్రోక్తంగా చేశారు. రాత్రి డాక్టర్ శ్రీనివాస్, పి.వి.కె. రమణప్రసాద్, శ్రీలక్ష్మి, సౌమ్యలు ఆలపించిన విశ్వగానలహరి భక్తి గీతాల సీడీని విశ్వయోగి విశ్వంజీ ఆవిష్కరించారు. తొలుత ఉదయం వేద పండితులు కూనపులి సుబ్రమణ్యశర్మ (ఫణి) ఆధ్వర్యంలో దుర్గాసప్తశతీ రాజశ్యామలా మంత్రసంపుటీ పూర్వక చండీ పారాయణ, సుందరకాండ పారాయణ, ధన్వంతరీ జపాలు, కమలాలయ దుర్గామంత్ర సంపుటిత శ్రీసూక్త మహాలక్ష్మి హోమం, సహస్రనామ కుంకుమార్చనలు, రుద్రక్రమార్చనలు నిర్వహించారు.

సుస్థిర అభివృద్ధి సదస్సులో వీవీఐటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ నిర్వహించిన సస్టైనబుల్ డెవలప్‌మెంట్ (సుస్థిర అభివృద్ధి) వర్క్‌షాప్‌లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరచి మొదటి బహుమతి దక్కించుకున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ప్రకృతిని పరిరక్షిస్తూ అధునాతన పద్ధతులు, నూతన ఆవిష్కరణల ద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధనకు ఐక్యరాజ్యసమితి సాధారణ సభ రూపొందించిన అజెండా– 2030 ప్రధాన అంశంగా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వర్క్‌షాప్ నిర్వహించింది. నంబూరు వీవీఐటీలో శుక్రవారం విద్యార్థుల్ని అభినందించిన చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడారు. ఎస్ఆర్ఎంలో మార్చి 1 న దేశవ్యాప్తంగా నిర్వహించిన సదస్సులో తమ విద్యార్థులు రూపొందించిన బిజినెస్ ప్లాన్, నూతన సాంకేతికత, ప్రజెంటేషన్ ఆధారంగా మొదటి బహుమతి సాధించారని వివరించారు. యుటోపియా న్యూట్రాసిటికల్స్ సీఈఓ, వ్యవస్థాపకురాలు డాక్టర్ బి. శ్రీలక్ష్మి రమ్యకృష్ణ చేతుల మీదుగా ఈ బహుమతి అందుకున్నారని తెలిపారు. విద్యార్థుల్ని అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ వై. మల్లికార్జునరెడ్డి, అడకమిక్స్ డీన్ కె. గిరిబాబు, అడ్మిన్ డీన్ ఎన్. కుమారస్వామి, కె.యు.ఎల్. సోమశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి: మేయర్



శ్రీనివాసరావుతోట శ్మశానవాటికలో పనులను పరిశీలిస్తున్న మేయర్

నెహ్రూనగర్: నగరంలోని శ్మశానవాటికల్లో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో స్వచ్ఛంద సంస్థల్ని కూడా భాగస్వామ్యం చేస్తామని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. శ్రీనివాసరావుతోటలోని హిందూ శ్మశానవాటికలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసరావుతోట శ్మశానవాటికను ఎనిమిదో డివిజన్‌లలోని సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్న దృష్ట్యా పలు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆవరణలో గ్రీనరీతో పాటు పెదకర్మ ఇతర కార్యక్రమాలు నిర్వహించే నిమిత్తం కొన్ని రోజుల పాటు అక్కడ ఉండేందుకు గదులు, భోజనశాల, వంటశాల, కేశ ఖండనం, సాన్నపు గదులు, అస్థికలు భద్రపరిచే గదులు, వాటిక బయట రోడ్డు విస్తరణ, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని వివరించారు. ఎలక్ట్రికల్ దహన యంత్రంతో పాటు అన్ని సౌకర్యాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పార్థివ దేహాల్ని భద్రపరచడానికి ప్రత్యేకంగా ఐస్ మార్చురీ గదులు, బాక్సులతో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాల్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, గేదెల నాగ రంగమణి , వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, నగరపాలక సంస్థ డీఈఈ రమేష్‌బాబు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలను తగ్గించకపోతే ఆందోళన : సీపీఎం



ధర్నాలో మాట్లాడుతున్న పాశం రామారావు

పాత గుంటూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. గ్యాస్ ధరలు పెరుగుదలకు వ్యతిరేకంగా శుక్రవారం బ్రాడీపేటలో సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలో రాకముందు గృహ సిలిండర్ ధర రూ. 425 ఉండగా, ప్రస్తుతం రూ.1200కు పెరిగిందని తెలిపారు. వాణిజ్య సిలిండర్ ధర కూడా రూ. 2100లకు చేరడంతో వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పెంచిన గ్యాస్ ధరల్ని కేంద్ర ప్రభుత్వం తగ్గించకపోతే మిగతా వామపక్ష పార్టీలు, అభ్యుదయవాదులతో పెద్దఎత్తున పోరాటాలు, ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఈమని అప్పారావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బి. ముత్యాలరావు, కె. శ్రీనివాసరావు, ఎం.ఏ. చిష్టీ, మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి లక్కా అరుణకుమారి, నాయకులు షేక్ ఖాశీం షహీద్, ఏ.కల్యాణి, షేక్ మస్తాన్‌వలి, జి. వెంకట్రావు, షేక్ ఖాశీంవలి, ఎం.సాంబశివరావు, వి.మూర్తి, షేక్ బాషా పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పెదకాకాని: ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చొని వెళుతున్న మహిళ మెడలో ఆగంతుకులు బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన గురువారం రాత్రి నంబూరు అడ్డ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామానికి చెందిన సాంబశివరావు, కృష్ణకుమారి దంపతులు గురువారం పేరేచర్లలో శుభకార్యానికి వెళ్లారు. రాత్రి ఇంటికి బైక్‌పై తిరుగు ప్రయాణం అయ్యారు. జాతీయ రహదారిపై నంబూరు అడ్డరోడ్డు సమీపంలోకి చేరుకునే సరికి వెనుక నుంచి మరొక బైక్‌పై వచ్చిన ఇద్దరు కృష్ణకుమారి మెడలో బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. ఘటనపై బాధితులు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పట్నంబజారు: పేద కుటుంబానికి నగర రజక జనసేవా సంఘం ఆర్థిక చేయూతనందించింది. బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదుట గంగానమ్మ కమ్యూనిటీ హాలు ఎదుట వివాహ కార్యక్రమంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరి ఫాతిమా చేతుల మీదుగా రూ. 50వేలు అందజేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల్ని ఆదుకునేందుకు రజక సంఘం నేతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పాపారావు, కార్యదర్శి లక్ష్మణరాజు పాల్గొన్నారు.